
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 5 మెదక్
సోమవారం 30 డిసెంబరు 2024
జిల్లాల వార్తలు



ఆయువు తీసేలా
వాయు కాలుష్యం
- జనావాసాలను కమ్మేస్తున్న దట్టమైన పొగలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
8



ఎండిన చెట్టు.. గీసినట్టు

సాధారణంగా ఎండాకాలంలో చెట్లకు ఆకులు రాలిపోతుండడం మనం చూస్తుంటాం. కానీ మండల కేంద్రమైన కోహీర్ నుంచి పైడిగుమ్మల్ గ్రామానికి వెళ్లే దారిలోని ఈ చెట్టు శీతాకాలంలోనే మోడువారి కనిపిస్తున్నది. అచ్చం చిత్రకారుడు కాన్వాస్‌పై తన కుంచెతో చెట్టు బొమ్మ గీసినట్లు కనిపించగా 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది.

- కోహీర్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి)

నిర్మలాజగ్గారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



నిర్మలాజగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరిన చేర్యాల గ్రామస్థులు



మాజీ సర్పంచ్ శ్రావణ్‌ను కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు

అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన కంది మండలం చేర్యాల గ్రామ తాజా, మాజీ సర్పంచ్ శ్రావణ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు టీజీఐఐసీచైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆంజనేయులు, పలువురు నేతలు పాల్గొన్నారు.

- సంగారెడ్డి టౌన్, డిసెంబరు29 (ఆంధ్రజ్యోతి)

నడిరోడ్డుపై శిశువు మృతదేహం

- 65వ జాతీయ రహదారి డివైడర్‌పై లభ్యం

సదాశివపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నడిరోడ్డుపై నవజాత శిశువు మృతదేహం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణ పరిధిలో లభ్యమైంది. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో సదాశివపేట పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయం ముందు వందలాది వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే 65వ నంబర్ జాతీయ రహదారి డివైడర్‌పై గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఎవరో నెలలు సైతం నిండని ఆడబిడ్డను ఓ చిన్న ప్లాస్టిక్ సంచిలో తెచ్చి జాతీయ రహదారి డివైడర్‌పై పెట్టి వెళ్లారు. స్థానికులు కొందరు పసిపాప మృతదేహాన్ని చూసి చలించిపోయి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని డివైడర్‌పై పడిఉన్న శిశువు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరా ఫుటేజీల పరిశీలనతో పాటు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేసినట్టు సదాశివపేట సీఐ మహేష్ కుమార్‌గౌడ్ తెలిపారు. ఆడబిడ్డ పుట్టిందని చంపేశారా..? లేదంటే పురిటిలోనే చనిపోయిన ఆడబిడ్డను తెచ్చి నడిరోడ్డుపై వదిలి వెళ్లారా అనేది అనుమానాస్పదంగా మారింది. కర్కశంగా బిడ్డను రోడ్డుపై పారవేయడంపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికంగా ఉన్న నర్సింగ్‌హోమ్‌ల్లోనే ఈ కాన్పు జరిగి ఉంటుందా.? అనే అనుమానాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు.



సదాశివపేటలో డివైడర్‌పై లభ్యమైన శిశువు మృతదేహం

సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంట కాలనీలో నివాసం ఉంటున్న పోలీస్ కానిస్టేబుల్ బాలకృష్ణ ఆదివారం ఉరేసుకుని చనిపోయాడు. ముందురోజు రాత్రి భార్య, ఇద్దరు కొడుకులతోపాటు తానూ ఎలుకల మందు తాగాడు. ఎవరూ చనిపోకపోవడంతో బాలకృష్ణ ఒక్కడే బెడ్రూమ్‌లోకి వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం అతని భార్య, ఇద్దరు కొడుకులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మితిమీరిన అప్పులే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది.

మెదక్ జిల్లా కొల్చారం పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సాయికుమార్ ఆదివారం ఉదయం అదే స్టేషన్ ఆవరణలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. 30 ఏళ్లుగా డిపార్ట్‌మెంట్‌లో కొనసాగుతున్న అనుభవం ఉన్నప్పటికీ ఇతర వ్యవహారాల్లో తలదూర్చిన కారణంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లుగా తెలుస్తున్నది.

మెదక్ జిల్లా కొల్చారం మండల కేంద్రానికి చెందిన సాతెల్లి సాయికుమార్ అనే ఎస్‌ఐ కామారెడ్డి జిల్లా బిక్కనూర్‌లో పనిచేస్తూ గత గురువారం ఓ చెరువులో శవమై తేలాడు. దీనికి సంబంధించిన కారణాలపై పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఇతర వ్యాపకాలే ఎస్‌ఐ మరణానికి దారితీసినట్లుగా చర్చ జరుగుతోంది. సాయికుమార్ గతంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు ఎస్‌ఐగా విధులు నిర్వహించాడు.



ఆన్‌లైన్ బెట్టింగులతో అప్పులపాలై భార్య, ఇద్దరు పిల్లలను కాల్చి తానూ కాల్చుకున్న సిద్దిపేట కలెక్టర్ గన్‌మన్, కానిస్టేబుల్ నరేశ్(ఫైల్)



సిద్దిపేటలోని తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ బాలకృష్ణ



కొల్చారం పోలీస్‌స్టేషన్ ఆవరణలోనే ఉరేసుకుని చనిపోయిన హెడ్‌కానిస్టేబుల్ సాయికుమార్



కామారెడ్డి జిల్లా బిక్కనూరులో ఎస్‌ఐగా చేస్తూ చెరువులో శవమై తేలిన కొల్చారానికి చెందిన సాయికుమార్

ఖాకీల్లో కల్లోలం

- ఉమ్మడి మెదక్ జిల్లాలో పోలీసుల చావులు
- వేర్వేరు ఘటనల్లో కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ ఆత్మహత్య
- ఒకరిది అప్పుల బాధ అయితే.. మరొకరు పరువు కోసం బలవన్మరణం
- ఐదురోజుల క్రితమే కొల్చారానికి చెందిన ఎస్‌ఐ మృతి
- గతంలో భార్య, ఇద్దరు పిల్లలను కాల్చి తానూ కాల్చుకున్న కానిస్టేబుల్ నరేశ్
- వృత్తిలో ఉంటూ ఇతరత్రా వ్యవహారాల్లో తలదూరుస్తున్న ఫలితం

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, డిసెంబరు 29 : నాలుగు రోజుల వ్యవధిలోనే ఉమ్మడి జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని కుదిపేసేలా చోటుచేసుకున్న పలు ఘటనలు చర్చనీయాంశంగా మారాయి. శాంతిభద్రతల పరిరక్షణ, సామాజిక రక్షణ, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనలో పోరాడాల్సిన పోలీసులే ఆత్మహత్యలకు పాల్పడటం విస్మయాన్ని కలిగిస్తోంది. అనవసర విషయాల్లో తలదూర్చుతూ చావును కొనితెచ్చుకుంటున్నారు. సర్కారు ఉద్యోగం, గౌరవప్రదమైన వృత్తిలో ఉంటూ కుటుంబాలను సైతం కాలరాస్తున్నారు. ఇటీవల పరిణామాలన్నీ మెతుకుసీమ పోలీసు శాఖలో, వారి కుటుంబాల్లోనూ కల్లోలం రేపుతోంది.

పక్కచూపులే కారణమా..

పోలీసు వృత్తిని నిర్లక్ష్యం చేస్తూ పక్కచూపులు చూస్తున్న వారికే ఈ పరిస్థితి దాపురిస్తున్నట్లుగా తాజా ఘటనలు అద్దం పడుతున్నాయి. విధి నిర్వహణలో సక్రమంగా ఉండకపోవడం, ఇతరత్రా వ్యవహారాలపై దృష్టిపెట్టడమే ఖాకీల జీవితాలను బలిగొన్నట్లుగా అర్థమవుతోంది. గతంలో సిద్దిపేట కలెక్టర్‌కు గన్‌మెన్‌గా ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ నరేశ్ ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసగా మారాడు. లక్షల్లో అప్పులు చేసి అవి తీర్చలేక తన ఇద్దరు పిల్లలు, భార్యను తుపాకీతో కాల్చి తానూ కాల్చుకొని చనిపోయాడు. తాజాగా

మిగతా 6వ పేజీలో

పెద్దచెరువు ముంపు బాధితులకు న్యాయం చేయాలి

- ఇరిగేషన్ అధికారుల తప్పిదంతోనే ఐదువేల మందికి అన్యాయం
- జేఏసీ ఆధ్వర్యంలో భారీ బైక్‌ర్యాలీ



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న పెద్దచెరువు ముంపు బాధితులు

పటాన్‌చెరు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ పెద్దచెరువు నీటిని దిగువకు వదలకపోవడంతో ఐదువేల మంది కుటుంబాలు వీధిన పడ్డాయని, తక్షణం ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ముంపు బాధితులు ఆదివారం భారీ బైక్, కారు ర్యాలీని నిర్వహించారు. జేఏసీ చైర్మన్ చిరునామా సత్యనారాయణ నేతృత్వంలో నిర్వహించిన ర్యాలీలో పెద్దసంఖ్యలో చెరువు ముంపు బాధితులు పాల్గొన్నారు. శ్రీవాణీనగర్ ఎల్లమ్మ ఆలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ హెచ్‌ఎంటీ స్వర్ణపురి, దర్శన్‌నగర్, పాంచజన్య, వెదిరి, చెరువుకట్ట, మున్సిపల్ కార్యాలయం నుంచి అమీన్‌పూర్ మున్సిపల్ కార్యాలయం, బీరంగూడా తహసీల్దార్ కార్యాలయం మీదుగా సాగింది. జాతీయ రహదారి మీదుగా పెద్దచెరువు కట్ట వరకు కొనసాగింది. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ దశాబ్ద కాలంగా నీటిని దిగువకు వదలకుండా చెరువు ఎత్తును కృత్రిమంగా పెంచడం ద్వారా పెద్ద ఎత్తున కాలనీల్లోని ప్లాట్లు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దచెరువు కాల్వలు కబ్జాచేసి, తూములు శిథిలమయ్యేందుకు కారణమైన వారిని వదిలేసి కష్టార్జితంతో ప్లాట్లు కొన్న వారిని వేధించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. పూర్తిస్థాయి హెచ్‌ఎండీఏ, పంచాయతీ అనుమతులతో 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన స్థలాలను కొందరు ఇరిగేషన్ అధికారుల తప్పిదాలతో నీటిలో ముంచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాట్లతో పాటు నీటిమట్టం పెరగడం వల్ల రైతుల భూములు సైతం చెరువులో కలిసిపోయాయన్నారు. ఆరు నెలలుగా పెద్దఎత్తున పోరాటాలు చేస్తున్నా న్యాయం చేయడంలేదని వాపోయారు. హైడ్రా కమిషనర్ సైతం అమీన్‌పూర్ పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌పై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయని ప్రకటించారని, త్వరలోనే నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. పాత రికార్డుల్లో ఉన్న ఎఫ్‌టీఎల్‌కు, కొత్తగా అధికారులు చెబుతున్న లెక్కలకు ఎక్కడా పొంతన కుదరడం లేదన్నారు. నీటిని వదలకుండా కృత్రిమంగా పెంచిన ఎత్తును చూపిస్తూ ఎఫ్‌టీఎల్ అని చెప్పడానికి ఇరిగేషన్ అధికారుల వద్ద ఎలాంటి ప్రామాణికమైన ఆధారాలు లేవన్నారు. రికార్డుల్లో ఉన్న చెరువు విస్తీర్ణం పక్కకు పెట్టి కాకిలెక్కలు చూపడం ద్వారా వేలాది కుటుంబాలు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని ముంపు బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో గ్రామ రైతులు రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, జేఏసీ సభ్యులు పూర్ణచందర్‌రావు, టీవీ.రావు, జీవ, సంజయ్, వెంకటేష్, విజయ్‌కుమార్, రవీందర్, గంగాధర్‌రాజు, సత్యనారాయణ రాజు, గణేష్ పెద్దసంఖ్యలో బాధితులు పాల్గొన్నారు.





మల్లన్న కల్యాణం నిర్వహిస్తున్న వీరశైవార్చకబృందం, గర్భాలయంలో దర్శనమిస్తున్న మల్లన్నస్వామి

కమనీయం..

కొమురవెల్లి మల్లన్న కల్యాణం

- తిలకించి పులకించిన భక్తజనం.. జనసంద్రంగా ఆలయ పరిసరాలు
- ఆలస్యంగా మొదలైన క్రతువు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనం

ముక్కోటి దేవతలు, పంచభూతాల సాక్షిగా, వీరశైవపండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయ ధ్వానాలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కొమురవెల్లి మల్లన్న కేతలమ్మ, మేడలాదేవీలను వివాహమాడారు. సనాతన వీరశైవాగమశాస్త్రం ప్రకారం మార్గశిర మాసం చివరి ఆదివారం పురస్కరించుకుని ఆలయప్రాంగణంలోని తోటబావి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కల్యాణ వేదికపై.. వీరశైవ కాశీపీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య వేదపర్యవేక్షణలో అంగరంగ వైభవంగా కల్యాణ క్రతువు నిర్వహించారు.

7



మంగళసూత్ర ధారణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు

'మల్లన్న'కు తగ్గిన కట్నాలు
శ్యామలకో లెక్క.. మాకో లెక్కా అంటూ జోగినుల ఆందోళన

క్రమబద్ధీకరణకు ప్రభుత్వంపై ఒత్తిడి
- సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చర్చిస్తా
- జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి చొరవ చూపాలి
- పే-స్కేలు ఫిక్స్ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు 7

అదుపుతప్పి ఆటో బోల్తా
- ఇద్దరికి తీవ్ర, ముగ్గురికి స్వల్పగాయాలు 8

రోడ్డుప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి 7

సీఎం కప్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు హుస్నాబాద్ క్రీడాకారుల ఎంపిక


కాంసాని సురేష్, చెప్యాల విజయ్

హుస్నాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీలకు సిద్దిపేట జిల్లా తరుపున హుస్నాబాద్‌కు చెందిన కాంసాని సురేష్, చెప్యాల విజయ్ ఎంపికైనట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఆర్ శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు సిద్దిపేటలో జరిగిన జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో వారు ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీ నుంచి 31 వరకు వరంగల్ నిర్వహించనున్న సీఎం కప్ రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీల్లో సురేష్, విజయ్ పాల్గొంటారని

వెంటనే రైతు భరోసా అందించాలి

ములుగు, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): రైతులకు రైతు భరోసా అందించి ఆదుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ములుగులో ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రైతులకు సరైన సమయానికి రైతుబంధు సాయం అందించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతు భరోసా అందించి ఆదుకోకపోతే బీఆర్ఎస్ పార్టీ తరఫున ధర్నా కార్యక్రమాలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

సీఎం కప్ రోయింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో హుస్నాబాద్ విద్యార్థుల ప్రతిభ


రోయింగ్ చేస్తున్న అభిజిత్, జశ్వంత్

హుస్నాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సీఎంకప్ రాష్ట్రస్థాయి రోయింగ్ పోటీల్లో హుస్నాబాద్ పట్టణానికి చెందిన కాశబోయిన అభిజిత్, జశ్వంత్ ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారు. గోల్డ్‌మెడల్ సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ.20,560 నగదు స్వాధీనం

తొగుట, డిసెంబరు 29: మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో ఆరుగురు వ్యక్తులు పేకాడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు, తొగుట పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడులు చేశారు. ఈ సందర్భంగా రూ.20,560 నగదు, 4 మొబైల్ ఫోన్‌లు, 5బైక్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదని ఎస్ఐ రవి కాంత్‌రావు హెచ్చరించారు.

ఖాకీల్లో కల్లోలం

5వ పేజీ తరువాయి

బిక్కనూరు ఎస్ఐగా ఉన్న కొల్చారం వాసి సాయికుమార్ మరణానికి అనవసర విషయాలే కారణమయ్యాయి. సిద్దిపేటలో ఆదివారం ఉరేసుకొని చనిపోయిన బాలకృష్ణ కూడా ఇతర వ్యాపకాలపై దృష్టి పెట్టి మితిమీరిన అప్పులు చేశాడు. ఆ అప్పుల బాధలు భరించలేకనే తన కుమారులు, భార్యకు ఎలుకల మందు తాగించాడు. కొల్చారంలో ఆదివారం ఉరేసుకుని చనిపోయిన సాయికుమార్ మృతి వెనుక కూడా ఇతరత్రా వ్యవహారాలే వినిపిస్తున్నాయి. అనవసర విషయాల్లో జోక్యం చేసుకున్నందుకు బెదిరింపులు తాళలేక పరువు కోసం ఆత్మహత్యకు పాల్పడ్డట్లుగా చర్చ జరుగుతోంది. సమాజంలో హుందాగా ఉండాల్సిన పోలీసులే ఇలా వ్యవహరించడం విమర్శలకు దారితీస్తోంది.

సొంతశాఖపై నిఘా అవసరమే

సొంత శాఖపై పోలీసు ఉన్నతాధికారులు పర్యవేక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం చనిపోయిన వారి దారిలోనే ఇంకొందరు పోలీసులు కూడా అనవసర విషయాల్లో తలదూరుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్ గేమ్‌లు, రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారాలు, చిట్‌ఫండ్స్, వివాహేతర సంబంధాలు, ఇసుక, రేషన్ బియ్యం, గంజాయి దందాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఇలా గంజాయి, ఇసుక అక్రమాల్లో భాగస్వాములైన పోలీసులపై వేటు పడిన సంఘటనలూ ఇటీవలే ఉమ్మడి మెదక్ జిల్లాల్లో చోటు చేసుకున్నాయి. పోలీసుల ప్రవర్తన, దైనందిన జీవితాలపైనా నిఘా పెడితే ఇలాంటి విషాద ఘటనలు తలెత్తేవి కాదనే వాదన నెలకొన్నది. ఈ అనవసర విషయాల్లో తలదూరుస్తున్నారని తోటి పోలీసులకు తెలిసినా మిన్నకుండి పోతున్నారు. స్టేషన్ల వారీగా ఉన్నతాధికారులు పర్యవేక్షించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. లేదంటే ప్రజల్లోనూ అభద్రతాభావం కలగకమానదు.


ఎలుకల మందు తాగి చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ బాలకృష్ణ భార్య, ఇద్దరు కుమారులు

'హలో మాదిగ.. చలో గజ్వేల్' విజయవంతం చేయాలి

మర్కుక్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): హలో మాదిగ చలో గజ్వేల్ పేరిట జనవరి 5వ తేదీన మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని కన్వీనర్ పొన్నాల కుమార్ మాదిగ పేర్కొన్నారు. ఇందుకు గజ్వేల్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి మాదిగ ఉపకులాల ప్రజలు స్వచ్ఛందంగా కలిసి రావాలని పిలుపునిచ్చారు.మండల కేంద్రంలో ఆదివారం స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి పొన్నాల కుమార్ మాదిగ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మర్కుక్ మండల కన్వీనర్ మొండి భిక్షపతి, సీనియర్ నాయకులు జాలని యాదగిరి, గజ్వేల్ బాధ్యులు దాచారం మహేష్, మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధిలో రమేష్ సేవలు అభినందనీయం

● ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ గాజర్ల రమేష్


డైట్ ప్రిన్సిపాల్ రమేష్‌బాబును సన్మానిస్తున్న ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ రమేష్

మెదక్ అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ అభివృద్ధిలో డైట్ ప్రిన్సిపాల్ శివ్వా రమేష్‌బాబు చేసిన సేవలు అభినందనీయమని రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి డైరెక్టర్ గాజర్ల రమేష్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) ప్రిన్సిపాల్ రమేష్ బాబు ఉద్యోగ విరమణ అభినందన సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. రమేష్‌బాబు ఉపాధ్యాయుడిగా ప్రస్థానం ప్రారంభించి జిల్లా విద్యా శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్‌గా ఎనలేని సేవలందించారని కొనియాడారు. అంతకుముందు నిర్వహించిన సెమినార్‌లో గణాత్మక విద్యా-ఉపాధ్యాయుని పాత్ర అనే అంశంపై జిల్లా విద్యాధికారి రాధాకిషన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, అకాడమిక్ మానిటర్ సుదర్శన్‌మూర్తి, ఎంఈవోలు మధుమోహన్, నీలకంఠం, యాదగిరి, అధ్యాపక బృందం, డైట్ ఛాత్రోపాధ్యాయులు, డీసీహెచ్ఎస్‌లు డాక్టర్లు చంద్రశేఖర్, శివదయాల్, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లను ఊడ్చి నిరసన

మెదక్ అర్బన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె 20వ రోజుకు చేరింది. ఆదివారం కలెక్టర్ మార్గంలో చీపుర్లు చేత పట్టి రోడ్లను ఊడ్చుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం మెదక్ జిల్లా అధ్యక్షులు రాజు, కార్యదర్శి పాషా, సంపత్, కనకరాజు, శంకర్, మంజుల, ధరణి పాల్గొన్నారు.

ఆలయ పునరుద్ధరణ పనులు పరిశీలన


ఆలయ పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న పీఠాధిపతి

పాపన్నపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన పాపన్నపేటలోని హనుమాన్ ప్రధాన ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా జరుగుతున్న పనులను జ్యోతిర్వాస్తు విద్యాపీఠం మహేశ్వరశర్మ సిద్ధాంతి స్వామి ఆదివారం పరిశీలించారు. హనుమాన్ ప్రధాన ఆలయం శిథిలావస్థకు చేరడంతో నూతనంగా పునర్నిర్మాణం చేపట్టాలని గ్రామస్థులు నిర్ణయించి పనులు చేపట్టారు. అందరి సహకారంతో పనులు పూర్తిచేసి త్వరగా విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. ఆలయ కమిటీ సభ్యులు స్వామిని ఘనంగా సన్మానించి ఆశీర్వచనం పొందారు. ఇందులో చికోడ్ సొసైటీ చైర్మన్ దత్తు, ఆలయ కమిటీ సభ్యులు కిషన్‌రెడ్డి, రాములు, విఠలేశ్వర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

మోతీమాత ఆలయ కార్యవర్గం ఎన్నిక


మోతీమాత ఆలయ నూతన కార్యవర్గం

జహీరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మొగుడంపల్లి మండలంలోని ఉప్పర్‌పల్లితండాలో గల మోతీమాత ఆలయం కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కేమసింగ్‌రాథోడ్, ఉపాధ్యక్షుడిగా నారాయణజాదవ్, ప్రధాన కార్యదర్శిగా పవన్‌రాథోడ్, అసోసియేట్ అధ్యక్షుడిగా శంకర్‌నాయక్, గౌరవ అధ్యక్షుడిగా కిషన్‌రావుపవర్‌ను ఎన్నుకున్నారు. జనవరిలో జరిగే మోతీమాత జాతరలో నూతనంగా ఎన్నికైన కమిటీ జాతర, ఆలయ అభివృద్ధి బాధ్యతలను చూసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాంశెట్టి, తులసీరాంరాథోడ్, హీరురాథోడ్, గోపాల్, ఉమేష్, ఖీరు, దేవిదాస్, లింబాజీ పాల్గొన్నారు.

వర్గీకరణతోనే దళితుల అభ్యున్నతి


తడ్కల్‌లోని నిర్వహించిన మాదిగల ప్రదర్శనలో డప్పు కొడుతున్న రాష్ట్ర కోఆర్డినేటర్ రమేష్

కంగ్టి, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్గీకరణతోనే దళితుల అభ్యున్నతి, ఐక్యత సాధ్యమౌతుందని వెయ్యిగొంతులు, లక్ష డప్పులు కార్యక్రమ రాష్ట్ర కోఆర్డినేటర్ డప్పుల్ల రమేష్ మాదిగ అన్నారు. ఆదివారం కంగ్టి మండల పరిధిలోని తడ్కల్‌లో వెయ్యిగొంతులు లక్ష డప్పులు మహా కళా ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కోసం 30 ఏళ్లుగా మందకృష్ణ మాదిగ చేపట్టిన ఉద్యమాలకు సుప్రీంకోర్టు తీర్పు ద్వారా ఊరట లభించిందన్నారు. ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో చేపట్టనున్న ప్రదర్శనకు మాదిగలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి అమృత్ బండారి, ఖేడ్ ఎమ్మార్పీఎస్ కన్వీనర్ జీవన్, విజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, లాల్‌కుమార్ పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తిచేయాలి'

నిజాంపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నిర్దేశిత సమయంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పూర్తి చేయాలని ఎంపీడీవో రాజిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నగరం గ్రామంలో ఆదివారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలవ్యాప్తంగా 65 శాతం సర్వే పూర్తయిందని, నిర్దేశిత సమయంలోగా మొత్తం పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.

కమనీయం..

కొమురవెల్లి మల్లన్న కల్యాణం


పాణిగ్రహణ క్రతువు నిర్వహిస్తున్న అర్చకులు


మంగళసూత్రాలను చూపిస్తున్న వీరశైవార్చకులు

తిలకించి పులకించిన భక్తజనం... జనసంద్రంగా ఆలయ పరిసరాలు
హాజరుకాని మంత్రులు కొండాసురేఖ, పొన్నం ప్రభాకర్
ప్రొటోకాల్ లేదనడంతో భక్తుల నడుమ కూర్చున్న ఎమ్మెల్యే 'పల్లా'
గంటన్నర ఆలస్యంగా కల్యాణం మొదలు



చేర్యాల, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : వీరశైవార్చకులు మల్లికార్జునస్వామి, కేతమ్మ, మేడలాదేవీల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగిస్తూ మహిళల కోలాటాల నడుమ భాజాభజంత్రీల మధ్య కల్యాణ మంటపానికి తీసుకువచ్చారు. వరుడు మల్లికార్జునస్వామి తరపున కన్యాగ్రహీతలుగా పడిగన్నగారి ఆంజనేయులు దంపతులు, అమ్మవార్లు గొల్ల కేతమ్మ, మేడలాదేవీల తరపున కన్యాదాతలుగా మహదేవుని భాస్కర్ దంపతులు వ్యవహరించారు. వీరశైవ ఆగమపండితులు గణపతిపూజ, స్వస్తి వాచనం, మంటప దేవతారాధన ప్రతిష్ఠ, పాదార్చన, భాషింగధా రణ, వస్త్రాలంకరణ, మధుసంపర్క స్వీకరణ, గూడజీర శిఖారాధన, కన్యాదానం, మంగళసూత్రధారణ జరిపారు. అనంతరం ముత్యాల తలంబ్రాలు, ఒడిబియ్యం పోశారు. ప్రత్యేక పూల అలంకరణ వేదికపై పట్టు వస్త్రాలతో ధగధగలాడుతున్న దేవతామూర్తులు భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారి కల్యాణ నిర్వహణ తీరు, విశేషాలను డాక్టర్ మహంతయ్య, శశిభూషణ సిద్ధాంతి చేసిన వ్యాఖ్యానం భక్తులను అలరించింది. మల్లన్నకీ జై అంటూ భక్తులు చేసిన జయజయధ్వానాలతో ఆలయ పరిసరాలు ప్రతిధ్వనించాయి. మల్లన్న కల్యాణం ఆద్యంతం ఆలస్యంగా జరిగింది. ఉదయం 10-45గంటలకు జరగాల్సి ఉండగా, మధ్యాహ్నం 12-28 గంటలకు మాంగళ్యధారణ చేశారు. కల్యాణ కైంకర్యం నిర్ణీత సమయానికన్నా గంటన్నరపాటు ఆలస్యమడంతో భక్తులు విస్మయం వ్యక్తంచేశారు. గర్భాలయంలోనూ మల్లన్నకు శాస్త్రోక్తయుక్తంగా కల్యాణాన్ని నిర్వహించారు. రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండాసురేఖ, బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లు ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు తలంబ్రాలు అందజేస్తారని ఉత్తర్వులు జారీచేశారు. కానీ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతితో ప్రభుత్వం సంతాపదినాలు పాటిస్తున్న కారణంగా వారు హాజరుకాలేదు. దీంతో ఆలయ వీరశైవార్చకులే పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకువచ్చి సమర్పించారు. అంతకుముందు యాదవపూజారులతో పాటు గ్రామపంచాయతీ తరుపున సంప్రదాయం ప్రకారం పట్టువస్త్రాలు తీసుకువచ్చారు. కల్యాణానికి మంత్రులు రానందున పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేత విషయమై ప్రొటోకాల్ లేదంటూ ఆలయాధికారులు తెలపడంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తోటబావి ప్రాంగణంలోని కల్యాణవేదికపై ఆసీనం కాకుండా వీవీఐపీ గ్యాలరీలో భక్తుల నడుమ సామాన్యుడిలా కూర్చుని కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులతోనే కలిసి దర్శనం చేసుకున్నారు.


కల్యాణ మండపానికి వస్తున్న వీరశైవ కాశీపీఠాధిపతి మల్లికార్జున విశ్వారాధ్య శివాచార్య

సంప్రదాయబద్ధంగా దృష్టికుంభం-బలిహరణ

తెల్లవారుజామున 4.30గంటలకు గర్భాలయ మండపంలోని వీరభద్రుడికి బలిహరణ చేసి దృష్టికుంభాన్ని ఘనంగా నిర్వహించారు. వీరశైవార్చకులు అన్నంరాశులపై గుమ్మడికాయలు నెలకొల్పి దండకాలతో హోరెత్తించిన అనంతరం గుమ్మడికాయను బలిచ్చి స్వామివారి తొలిదర్శనాన్ని ప్రారంభించారు. మల్లన్నకు చత్రకన్ను అమర్చి శత రుద్రాభిషేకం పూజలు నిర్వహించారు.

హాజరైన, ప్రముఖులు

కల్యాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, బీసీ కమిషన్ సభ్యురాలు రంగు బాలలక్ష్మి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కాల్వ సుజాత, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, మాజీ జడ్పీటీసీలు కొమ్ము నర్సింగరావు, గిరి కొండల్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మేరుగు కృష్ణ, నాయకులు కొమ్ము రవి, మేరుగు శ్రీనివాస్, సనాది భాస్కర్, చెరుకు రమణారెడ్డి, భీమ లక్ష్మణ్, లింగంపల్లి శ్రీనివాస్, బొంగు రాజేందర్‌రెడ్డి, వంగ జయలక్ష్మి, కామిడి రమేశ్‌రెడ్డి, మల్లన్న ఆలయ డైరెక్టర్లు, నాయకులు గదరాజు చందు, శివగారి అంజయ్య, ఏర్పుల మహేశ్, బొంగు రాజేందర్‌రెడ్డి, సిలివేరు సిద్దప్ప, గీస భిక్షపతి, గదరాజు యాదగిరి, పచ్చిమడ్ల మానస, మీస పార్వతి, బుడిగె రమేశ్, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నేతలు, అధికారులు హాజరయ్యారు.

మల్లన్న మా ఇలవేల్పు : మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



కొమురవెల్లి మల్లన్న తమ ఇలవేల్పుదైవమని, ఏటా మల్లన్నను దర్శించుకుంటున్న క్రమంలో మల్లన్న కల్యాణానికి వచ్చినట్లు మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. కల్యాణానంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను చిన్ననాటి నుంచి ఎంతో కష్టపడ్డానని, పాలు, పూలు అమ్మి ప్రయోజకుడినయ్యానని, మల్లన్న దయతో మరింత ఎదిగానన్నారు.

మల్లన్నకు తగ్గిన కట్నాలు

మల్లన్న కల్యాణం సందర్భంగా కన్యాదాన సమయంలో ప్రజాప్రతినిధులు కట్నాలు చదివిస్తారు. గతంలో మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు అధికంగా కట్నాలు చదివించేవారు. కానీ ఆదివారం జరిగిన కల్యాణంలో మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి రూ.2 వేలు, భువనగిరి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి రూ.11వేలు, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రె డ్డి రూ.10,116వేలు చొప్పున కట్నాలు అందించినట్లు వేదికపై అర్చకులు ప్రకటించారు. దీంతో గతంలో కన్నా కట్నాలు తగ్గాయి.

కానరాని తలంబ్రాల పంపిణీ - తాగునీటి సరఫరా

భక్తులందరికీ తలంబ్రాలు అందించాలని, నీటిసౌకర్యం కల్పించాలని కలెక్టర్ మనుచౌదరి తదితరులు సూచించినప్పటికీ కానీ ఆలయవర్గాలు చేతులెత్తేశారు. వేదికపై కూర్చున్న వీఐపీలకు వాటర్‌బాటిళ్లు అందించి తరించి సామాన్యుల గొంతు ఎండగట్టారు. తలంబ్రాలు ఎవరికీ అందించలేదు. ఉడికీ, ఉడకని భోజనంతో పాటు తాగునీటి వసతి కల్పించకపోవడంతో భక్తులు దాహార్తికి తల్లడిల్లారు. అలాగే రాజగోపుర ఆవరణ నుంచి తోటబావి ప్రాంగణం వరకు దారి చిత్తడిగా మారింది.

శ్యామలకో లెక్క.. మాకో లెక్కనా..!

బండారి, ఒడిబియ్యం సమర్పించేందుకు జోగినీలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కానీ పోలీసులు డోనర్, వీఐపీ గ్యాలరీకి అనుమతించడంతో కూర్చున్నారు. మాంగళ్యసూత్రధారణ సమయానికి కొంతముందర జోగినీ శ్యామల వచ్చీ రాగానే నేరుగా వేదికపైకి వెళ్లింది. దీంతో మిగతావారు తమను వేదికపైకి అనుమతించాలని కోరడంతో పోలీసులు నిరాకరించి స్టాపర్స్ అడ్డుపెట్టారు. తామెంతో భక్తిప్రపత్తులతో ఒక్కపొద్దు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నామని, శ్యామలను పంపించి, తమపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని మండిపడ్డారు.

ప్రొటోకాల్ పాటిస్తే మంచిది



చట్టప్రకారం ప్రొటోకాల్ పాటిస్తే అందరికీ బావుంటుందని.. మల్లన్న కల్యాణ విషయంలో పొరపాట్లు నెలకొన్నప్పటికీ దేవుడివద్ద రాజకీయం చేయడం ఇష్టంలేక ఊరుకున్నట్లు జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మంత్రులు హాజరుకాకపోవడంతో తలంబ్రాలు, పట్టువస్త్రాల సమర్పణలో ప్రొటోకాల్ లేదని ఆలయవర్గాలు తెలపడంతో ఆయన వేదికపై కాకుండా వీవీఐపీ గ్యాలరీలో కూర్చుని కల్యాణం తిలకించారు. ఈ విషయమై అనంతరం విలేకరులతో మాట్లాడారు. రాజకీయాలకు తావులేకుండా పట్టువస్త్రాలు, తలంబ్రాలు మంత్రులు, ఎమ్మెల్యేలు సమర్పించాల్సి ఉన్నప్పటికీ ప్రొటోకాల్ లేకుండా తాము మాత్రమే తీసుకువెళ్తామనడం సబబు కాదన్నారు. వచ్చే ఏడాది కల్యాణం నాటికైనా మౌలిక వసతులు, సౌకర్యాలు మెరుగుపరచాలని సూచించారు.

దేవుడి దగ్గర కూడా రాజకీయమేనా ?



ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రొటోకాల్ పేరిట మొసలికన్నీరు కార్చుతూ దేవుడి దగ్గర కూడా రాజకీయం చేయడం తగదని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే పల్లా విషయమై ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సంతాపదినాల కారణంగా మంత్రులు హాజరు కాలేదని, తద్వారా అధికారికంగా ఆలయవర్గాలే తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారే తప్ప అందులో ప్రొటోకాల్ ఉల్లంఘన ఏదీ జరగలేదన్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా కల్యాణవేదికపైకి వచ్చి కూర్చునే అధికారం, బాధ్యత ఉన్నప్పటికీ రాజకీయం చేయాలన్న దురుద్దేశంతోనే గ్యాలరీలో కూర్చుకున్నారన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వేదికపై ఆసీనుడయ్యారని, ఆయనకు లేని ఆక్షేపణ ఎమ్మెల్యే పల్లాకు ఎందుకు వచ్చిందో ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు.



తలంబ్రాలు, పట్టువస్త్రాలు తీసుకువస్తున్న అర్చకులు, బలిహరణ చేస్తున్న అర్చకులు

క్రమబద్ధీకరణకు ప్రభుత్వంపై ఒత్తిడి

● మెదక్ ఎంపీ రఘునందన్‌రావు


సమ్మెకు సంఘీభావం తెలిపిన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

సంగారెడ్డి అర్బన్, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్షా ఉద్యోగుల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద గత 23 రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల నిరవధిక సమ్మెకు ఆదివారం ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గతేడాది పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి వరంగల్‌లోని సమ్మె శిబిరం వద్దకు వచ్చి చాయితాగినంత సేపట్లో సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపుతానన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయి 12 నెలలు గడుస్తున్నా చాయితాగినట్టు లేరేమో, చాయి తాగి ఉంటే గుర్తుచ్చునేమో అంటూ సెటైర్లు వేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి చర్చిస్తానన్నారు. జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి తక్షణమే వీరి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల జీతాల్లో 60 శాతం నిధులు కేంద్రం ఇస్తుంటే మిగిలిన 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. అయితే పే-స్కేలు ఫిక్స్ చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. ఈ నేపథ్యంలో పే-స్కేలు ఫిక్స్ చేస్తే కేంద్రం నుంచి 60 శాతం ఒప్పించి ఇప్పించే బాధ్యత తాను తీసుకుంటానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు దత్తు, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కర్రసాము పోటీల్లో శ్రీవల్లి ప్రతిభ

పటాన్‌చెరు, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): ఇటీవల పాండిచ్చేరీలో జరిగిన జాతీయ స్థాయి గ్రామీణ క్రీడల పోటీలలో రామచంద్రాపురం పట్టణానికి చెందిన ఆలూరి శ్రీవల్లి ప్రతిబ కనబర్చింది. కర్రసాము పోటీలలో పాల్గొని సిల్వర్‌మెడల్ కైవసం చేసుకుంది. శ్రీవల్లి పటేల్‌గూడా ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. చిన్నతనం నుంచే శ్రీవల్లికి కర్రసాములో శిక్షణ ఇప్పించామని తండ్రి ఆలూరి గోపాల్ తెలిపారు.


సిల్వర్‌మెడల్ సాధించిన శ్రీవల్లి

వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

● ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు
● భక్తుల రద్దీతో సందడిగా పరిసరాలు
● దర్శించుకున్న నాయకులు


వర్గల్ : నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో భక్తుల రద్దీ

పాపన్నపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఏడుపాయల వన దుర్గ భవాని మాత ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. మంజీరా నది మడుగులలో, చెక్ డ్యాం వద్ద పుణ్యస్నానం ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ఒడి బియ్యం, కుంకుమార్చనలు, తలనీలాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలఅయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అమ్మవారిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దర్శించుకున్నారు. ముందుగా ఆలయ అర్చకులు, వేద పండితులు ఆయనకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఆయన వెంట నర్సాపూర్ నియోజక వర్గ ఇన్‌చార్జి అవుల రాజిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రెడ్డి, సుప్రభాత రావ ఉన్నారు.


పాపన్నపేట : ఏడుపాయల వన దుర్గామాతను దర్శించుకుంటున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ


కొండపాక : మర్పడగ మల్లికార్జున స్వామి

● వర్గల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అత్యంత ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వర్గల్ మండలం నాచారం నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రం ధనుర్మాసం సందర్భంగా రెండవ ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయం వద్ద స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. క్షేత్రానికి వచ్చిన భక్తుల కాలక్షేపం కోసం ఆలయం వద్ద అభిమన్యుడి కల్యాణం చిందు యక్షగానం నిర్వహించారు. భక్తుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నీ ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి ఎస్.అన్నపూర్ణ తెలిపారు.

● కొండపాక, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో మాస శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ పర్యవేక్షణలో సంతాన మల్లికార్జున స్వామి వారికి అన్నాభిషేకం నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం కాగా విజయ దుర్గా మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం లఘున్యాస పూర్వకంగా సంతాన మల్లికార్జున స్వామికి విశేష పంచామృత ఫలరస అభిషేకం నిర్వహించి అన్నాభిషేకం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణ కమిటీ సభ్యులు గట్టు విఠల్, చీకోటి మల్లికార్జున్, జిల్లా సతీష్ కుమార్ , తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● జగదేవ్‌పూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంతంలో ప్రసిద్ధిగాంచిన కొండపోచమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. కొమురవెల్లి మల్లన్న కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు మధ్యాహ్నం తిగుల్ నర్సాపూర్ గ్రామం సమీపంలోని అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. బోనం కుండల్లో నైవేద్యం వండుకొని డప్పుచప్పుల్లు మధ్య అమ్మవారి చెంతకు తీసుకెళ్లి సమర్పించుకున్నారు. అమ్మవారికి ఒడిబియ్యం వేసేందుకు భక్తులు పోటీపడ్డారు. ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఈవో రవికుమార్, సిబ్బంది మహేందర్‌రెడ్డి, కనకయ్య, లక్ష్మణ్, సుదాకర్, హరి, చిన్నా, చంద్రం, ఆంజనేయులు తదితరులుపాల్గొన్నారు.


జగదేవ్‌పూర్ : కొండపోచమ్మ దర్శనం కోసం బారులు..


భక్తులతో కిక్కిరిసిన ప్రార్థన మందిరం

మెదక్ చర్చికి పోటెత్తిన భక్తులు

మెదక్ కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మెదక్ సీఎస్ఐ చర్చిలో క్రిస్మస్ సందడి కొనసాగుతుంది. ఆదివారం ప్రెసిబేటరీ ఇన్‌చార్జి శాంతయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రార్థనల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయమే శిలువ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రతిష్ఠించిన అనంతరం ప్రార్థనలు చేశారు. భక్తులకు మత గురువులు ఆశీర్వచనాలు అందజేశారు.

నర్సాపూర్‌లో మంత్రికి సన్మానం


మంత్రి దామోదర్ రాజనర్సింహను సత్కరిస్తున్న నాయకులు

నర్సాపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మెదక్‌లో ఆదివారం ఓ కార్యక్రమానికి వెళ్తున్న రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మార్గమధ్యలో నర్సాపూర్‌లో కాసేపు ఆగారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయానికి వెళ్లి నేతలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంతారా సుధీర్‌గౌడ్ మంత్రిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్, ఓబీసీ మండల అధ్యక్షుడు అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డుప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

జహీరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్ కథనం ప్రకారం మండల పరిధిలోని బూచనెల్లి గ్రామ శివారులో 65 నంబరు జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి హైదరాబాద్ వైపు నడుచుకుంటూ వెళ్తుండగా అతడిని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాని స్వాధీనం చేసుకుని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35 సంవత్సరాలు ఉంటుందని, సంబంధీకులు ఎవరైనా ఉంటే 8712656766 నంబరును సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


అశోక్‌గౌడ్ (ఫైల్)

శివ్వంపేట, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కొంతాన్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన గున్నాల అశోక్‌గౌడ్(38) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులు, అప్పులు తీర్చేందుకు తనకున్న పొలాన్ని విక్రయించాలని అనుకున్నాడు. పొలం అమ్మితే ఇద్దరు ఆడపిల్లల భవిష్యత్ ఎలా అని కుటుంబీకులు అశోక్‌ను అడిగారు. దీంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడు ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

పార్ట్‌టైం ఉపాధ్యాయుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నారాయణఖేడ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకులపాఠశాల, కళాశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ(ఆంగ్లం), టీజీటీ(తెలుగు) పోస్టుల్లో పార్ట్‌టైం ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ లింగారెడ్డి ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సోమవారం ఉదయం 10 గంటలకు గురుకులంలో నిర్వహించే డెమో తరగతులకు ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.

న్యూస్ బాక్స్

హరికృష్ణశర్మకు డాక్టరేట్



హరికృష్ణను సన్మానిస్తున్న దృశ్యం

నర్సాపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌కు చెందిన వేదపండితుడు, ఉపాధ్యాయుడు గౌడిచర్ల హరికృష్ణశర్మకు ఏషియన్ కల్చరల్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో యూఎస్‌ఏ చైర్మన్ రమేష్ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణశర్మ మాట్లాడుతూ తనకు డాక్టరేట్ రావడం ఎంతో ఆనందంగా ఉందని, వేదగణితంతో పాటు జ్యోతిష్య శాస్త్రాన్ని ఆధునిక ప్రపంచంలో నేటి పరిస్థితులకు అనుగుణంగా ఉపయోగించడానికి కృషి చేస్తానన్నారు.

మాధవానందస్వామి ఆశ్రమంలో ఆరాధనోత్సవాలు



రంగంపేట ఆశ్రమాన్ని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కొల్చారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో రంగంపేట గ్రామ శివారులోని మాధవానంద ఆశ్రమంలో ఆరాధనోత్సవాలు మాధవానంద సరస్వతిస్వామి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. రెండోరోజు ఆదివారం మహా రుద్రము, హరికథ కాలక్షేప కార్యక్రమాన్ని చేపట్టారు. ఆశ్రమ ఆవరణలో ఫిజియోథెరపీ వైద్య శిబిరాన్ని సమక్షంలో నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ సుహాసినిరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అల్లు మల్లారెడ్డి, నాయకులు బండి రమేష్, కంచర్ల నాగరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ గోపిగారి దుర్గేష్‌గౌడ్, కొమ్ముల రవీందర్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు అల్లి చందు పాల్గొన్నారు.

తూప్రాన్‌లో లోపించిన పారిశుధ్య పనులు

తూప్రాన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ మున్సిపల్ పరిధిలో పారిశుధ్య పనులు లోపించాయని మున్సిపల్ మాజీ చైర్మన్ బొంది రాఘవేందర్‌గౌడ్ ఆరోపించారు. తూప్రాన్ పట్టణంలోని 1వ వార్డులో సొంత ఖర్చులతో ఎక్స్‌వేటర్ ఏర్పాటు చేసి పారిశుధ్య పనులు చేపట్టారు. ఇందులో బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం అందజేత

నాగల్‌గిద్ద, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మావినెల్లి గ్రామంలో చెన్న బసవేశ్వర ఆలయ నిర్మాణానికి నారాయణఖేడ్ పట్టణానికి చెందిన మహేష్‌షెట్కార్ ఆదివారం రూ.లక్షా 11 వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సహజ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సహజ యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని సహజ యోగా ధ్యాన కేంద్రం సభ్యులు తెలిపారు. సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం సహజ యోగా ధ్యాన కేంద్రం ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.

'హిందూ పరిషత్' మండల అధ్యక్షుడిగా సత్యనారాయణ

బెజ్జంకి, డిసెంబరు 29: రాష్ట్రీయ హిందూ పరిషత్ మండల అధ్యక్షుడిగా మండలంలోని దాచారం గ్రామానికి చెందిన బండిపల్లి సత్యనారాయణ గౌడ్ నియామకమయ్యారు. ఈ మేరకు ఆదివారం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బండి అఖిల్ నియామక పత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన వారికి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

అదుపుతప్పి ఆటో బోల్తా

● ఇద్దరికి తీవ్ర, ముగ్గురికి స్వల్పగాయాలు

కొల్చారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపుతప్పి బోల్తాపడిన సంఘటన కొల్చారం మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకున్నది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండల కేంద్రానికి చెందిన కుటుంబసభ్యులు గండి మైసమ్మ నుంచి తమ స్వగ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడడంతో ఇద్దరికి కాళ్లు విరిగాయి. మిగతా ముగ్గురు స్వల్పగాయాలతో బయటపడ్డారు. ఆటోడ్రైవర్ లింగం మాట్లాడుతూ స్టీరింగ్ రాడ్ విరిగిపోవడంతో అదుపు తప్పిందని తెలిపారు. వారిని 108 అంబులెన్స్‌లో మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

ఆదరణకు నోచుకోని.. మహనీయుల విగ్రహాలు

● రోడ్డు విస్తరణ సందర్భంగా చిల్డ్రన్ పార్కుకు తరలింపు
● ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని నాయకులు, అధికారులు
● కొత్త సంవత్సరంలోనైనా మోక్షం లభించేనా?



ఆదరణకు నోచుకోకుండా చిల్డ్రన్స్ పార్కులో ఉన్న అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్, వైఎస్సార్ విగ్రహాలు

నర్సాపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో మెదక్-హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై గతంలో ఏర్పాటు చేసిన మహనీయుల విగ్రహాలు ఆదరణకు నోచుకోవడం లేదు. ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోకపోవడంతో చిల్డ్రన్స్ పార్కులోనే ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఉన్నాయి. ఐదేళ్ల క్రితం జాతీయ రోడ్డు విస్తరణ సందర్భంగా ప్రధాన చౌరస్తాలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలతో పాటు మాజీ సీఎం, మాజీ డిప్యూటీ సీఎంల విగ్రహాలను తొలగించారు. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలను తొలగించే క్రమంలో అభ్యంతరాలు రావడంతో అందరి ఆమోదం మేరకు అనువైన స్థలం ఎంపిక చేసి అక్కడ ఏర్పాటు చేస్తామని, అంతవరకు తాత్కాలికంగా చిల్డ్రన్స్ పార్కులో ఉంచారు. అయితే వాటిని ఏర్పాటుచేసి ఐదేళ్లకు పైగా అవుతున్నా పట్టించుకునేవారు లేకుండాపోయారు. పైగా ఈ మహనీయుల జయంతి, వర్ధంతితో పాటు ఏదైనా సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చే సమయంలో మాత్రం అంబేడ్కర్, బాబుజగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద ఫొటోలు దిగి వెళ్తున్నారే తప్ప.. వాటిని అనువైన చోట ఏర్పాటు చేద్దామన్న ఆలోచన మాత్రం ఎవరికీ రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చిల్డ్రన్స్ పార్కులో ఈ మహనీయుల విగ్రహాలు ఏ ఆదరణ లేకుండా వదిలేయడం పట్ల సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త సంవత్సరంలోనైనా స్థలం ఎంపిక చేసి మహనీయుల విగ్రహాలను ప్రతిష్ఠించాలని స్థానికులు కోరుతున్నారు.

మిత్రులతో గడిపిన జ్ఞాపకాలు మరిచిపోలేనివి



పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్/జిన్నారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిత్రులతో కలిసి గడిపిన జ్ఞాపకాలు మరువలేనివని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని అబిడ్స్ తిలక్‌రోడ్‌లో గల రాజాబహదూర్ వెంకటారామిరెడ్డి హాస్టల్‌లో 1978-79 బ్యాచ్ విద్యార్థుల పూర్వ విద్యార్థుల సమ్మేళనం అక్కడి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించారు. అదే బ్యాచ్‌కు చెందిన సంజీవరెడ్డి పాల్గొని మాట్లాడుతూ హాస్టల్‌లో ఉండి క్రమశిక్షణతో చదివి చాలా మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారన్నారు. ఇన్నాళ్లకు పూర్వ విద్యార్థులమంతా కలుసుకొని అనుభవాలు పంచుకోవడం ఆనందంగా ఉందన్నారు. రాష్ట్రమంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నిజామాబాద్ గ్రామీణ, నిర్మల్, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, మాజీ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు చిన్నారెడ్డి, పటేల్‌రమేష్, అలాగే ఎమ్మెల్యే సోదరుడు సుధాకర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. అలాగే బొల్లారంలో 2001-02 సంవత్సరంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.

నాయకుల సమన్వయ లోపంతోనే నష్టం: ఎమ్మెల్యే



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట/నర్సాపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నాయకుల సమన్వయ లోపంతోనే ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల్లో దొంతి గ్రామంలో బీఆర్ఎస్‌కు నష్టం కలిగిందని, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నర్సాపూర్ ఎమ్మెల్యే కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మండల పరిధిలోని మేజర్ గ్రామపంచాయతీ దొంతి బీఆర్ఎస్ గ్రామ కమిటీ ఎన్నిక ఆదివారం దొంతిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామ అధ్యక్షుడిగా చిగుర్లపల్లి శ్రీనివాస్ గుప్తా, ఉపాధ్యక్షుడిగా ఎండీ.లాయక్, ప్రధాన కార్యదర్శిగా కే.నర్సింలు, అనుబంధ కమిటీలను ఎన్నుకున్నారు. ముందుగా గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు, పార్టీ మాజీ మండలాధ్యక్షుడు పిట్ల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ అంజయ్య, గ్రామ అధ్యక్షుడు సత్యనారాయణ మృతిచెందడంతో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి మాట్లాడుతూ సోషల్ వర్కర్‌గా సేవలందిస్తున్న శ్రీనివాస్‌గౌడ్‌ను గ్రామ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం మండలంలో పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రగౌడ్, మాజీ జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు మన్సూర్, పార్టీ అధ్యక్షుడు రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే నర్సాపూర్ మండలం తిర్మలాపూర్‌లో నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీం, పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్, మాజీ ఎంపీటీసీ సత్యంగౌడ్, నాయకులు పాల్గొన్నారు.

కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చాలి: బాపుమల్‌శెట్టి



భూంగొండేశ్వర వార్షికోత్సవంలో ఎంపీ సురేష్‌షెట్కార్, కురుమ సంఘం నాయకులు

నారాయణఖేడ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చాలని గొర్రెలు, మేకల పెంపకం దారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపుమల్‌శెట్టి కోరారు. ఆదివారం నారాయణఖేడ్‌లో భూంగొండేశ్వర విగ్రహ రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భూంగొండేశ్వరుడికి పూలమాలవేసి మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రంలో మాదిరిగా తెలంగాణలోనూ కురుమలను ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని పార్టీల వారు కురుమలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ముత్యాల కిష్టయ్య, జిల్లా, స్థానిక సంఘాల నాయకులు ప్రభాకర్, లక్ష్మీబాయి, సంజీవ్‌జాదవ్, నరేష్‌యాదవ్ పాల్గొన్నారు.

ఉత్సవాల్లో ఎంపీ, పలువురు నేతలు

నారాయణఖేడ్‌లో నిర్వహించిన భూంగొండేశ్వర విగ్రహ వార్షికోత్సవంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌షెట్కార్, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ప్రణాళిక మండలి మాజీ సభ్యుడు నగేష్‌షెట్కార్ పాల్గొన్నారు. అనంతరం వారికి ఉత్సవ కమిటీ బాధ్యులు శాలువలు, పూలమాలలతో సన్మానించారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి

● మంత్రి దామోదర్ ను కోరిన నాయకులు



దామోదర్‌కు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

కొల్చారం, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కొల్చారం మండల అభివృద్ధి కోసం ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మల్లేశంగౌడ్, రమేష్, రాజాగౌడ్, నరసింహులు, బీసీ సెల్ అధ్యక్షుడు అశోక్‌గౌడ్ కోరారు. ఈ సందర్భంగా పోతంశెట్టిపల్లి వద్ద మంత్రికి స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం మంత్రి ఏడుపాయల వనదుర్గామాతను దర్శించుకున్నారు. ఆయనవెంట నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసినిరెడ్డి ఉన్నారు.

కానిస్టేబుళ్ల కుటుంబాలకు ఆర్థిక సాయం

సిద్దిపేటక్రైం, డిసెంబరు 29(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుళ్లు పరంధాములు, వెంకట్ కుటుంబ సభ్యులకు హైదరాబాద్‌కు చెందిన ఈసీఐఎల్ రన్నర్స్ అసోసియేషన్ వారు ఆర్థికసాయాన్ని అందజేశారు. ఇరు కుటుంబాల వారికి ఒక్కో కుటుంబానికి రూ.లక్షా 50 వేల చొప్పున ఆదివారం అందజేశారు. ఆయా కుటుంబాల్లోని పిల్లల చదువుల కోసం భవిష్యత్తులో మరింత సహాయం అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు.

వెంకటేశ్వర కాలనీకి రూ.50 లక్షల నిధులు కేటాయించాలి

● ఎంపీ రఘునందన్‌రావుకు కాలనీవాసుల విజ్ఞప్తి



ఎంపీ రఘునందన్‌రావును కలిసి నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్న కాలనీవాసులు

నర్సాపూర్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్‌లోని 9వ వార్డులో ఉన్న వెంకటేశ్వర కాలనీలో మౌలిక సదుపాయల కల్పనకు రూ.50 లక్షల ఎంపీ నిధులు కేటాయించాలని కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు ఎంపీ రఘునందన్‌రావును కోరారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసానికి ఓబీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిన్నరమేష్‌గౌడ్ నేతృత్వంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు వెళ్లి వినతిపత్రం అందజేశారు. కొత్తగా ఏర్పడిన కాలనీలో మురుగు కాలువలు, రోడ్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామన్నారు. ఎంపీ సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీఇచ్చారని, అందుకు కాలనీ తరపున ఎంపీకి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి తెలిపారు. వినతిపత్రం అందజేసినవారిలో ఆంజనేయులు, శ్రీనివాస్‌గౌడ్, శంకర్‌నాయక్, వెంకట్‌గౌడ్, శ్రీనివాస్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు అంజిగౌడ్ ఉన్నారు.

కాంగ్రెస్ పాలనలో తిరోగమనంలో ఖేడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో నారాయణఖేడ్ మున్సిపాలిటీ తిరోగమనంలోకి వెళ్తుందని మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం నారాయణఖేడ్‌లో మాజీ సర్పంచ్ నజీబ్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పరశురాం, మాజీ ఎంపీటీసీ ముజమ్మిల్, విజిలెన్స్ కమిటీ మాజీ సభ్యులు రవీందర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు నగేష్, పుటాల విఠల్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా తమ పార్టీకి చెందిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లను అవిశ్వాస తీర్మానం ద్వారా తొలగింపజేసి కాంగ్రెస్ వారే అధికారంలోకి వచ్చినా మున్సిపల్ అభివృద్ధికి వారు చేసింది ఏమి లేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రూ.15 కోట్లు మంజూరు చేసినా, టెండర్లు వేసేవారు డబ్బులు ఇవ్వకపోవడంతో వాటిని రద్దు చేయించారని భూపాల్‌రెడ్డి ఆరోపించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు స్థానికులే అయినా పట్టణ అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదన్నారు. పట్టణాన్ని దశాబ్దం వెనక్కి నెట్టిన కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆయువు తీసేలా వాయు కాలుష్యం

● జనావాసాలను కమ్మేస్తున్న దట్టమైన పొగ ● ఇబ్బంది పడుతున్న ప్రజలు

జిన్నారం, డిసెంబరు, 29 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామికవాడల నుంచి వెలువడుతున్న విష రసాయన వాయువులు స్థానికుల ఆయువు తీసేలా మారాయి. నిత్యం పరిశ్రమల గొట్టాల నుంచి దట్టమైన పొగలు స్థానిక గ్రామాలను కమ్మేస్తున్నాయి. రసాయన, ఐరన్, క్యాస్టింగ్ తయారీ పరిశ్రమల నుంచి నిత్యం కాలుష్య కారక వాయువులు వెలువడుతున్నాయి. ముఖ్యంగా రసాయన పరిశ్రమలకు చెందిన ఘన వ్యర్థాలను ఫోర్స్ ఎవాబిరేషన్ పద్ధతిలో మండించే చోట నుంచి ఘాటైన విషవాయువులు వెలువడుతున్నాయి. దీంతో బొల్లారం, కాజీపల్లి, గడ్డపోతారం పారిశ్రామికవాడలతో పాటు వాటి సమీప నివాస ప్రాంతాల ప్రజలు శ్వాస కోశ సంబంధిత వ్యాధుల బారినపడుతున్నారు. ఇక గాలిలో సాధారణ నాణ్యత సూచిక (ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్) ప్రకారం 0.50 ఉండాల్సి ఉండగా.. ఇక్కడ సాధారణంగా 80 నుంచి 200 శాతం వరకు నమోదవుతుంది.



గడ్డపోతారంలో ఓ పరిశ్రమ నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం

రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

● సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి



సంగారెడ్డిలో ట్రెస్మా కమిటీ సభ్యులను సన్మానించిన జిల్లా కమిటీ సభ్యులు

సంగారెడ్డి రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా ట్రెస్మా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి పనిచేయాలన్నారు. రెవెన్యూ వ్యవస్థలో ఎన్ని సంఘాలు వచ్చినా ట్రెస్మా కృషి వల్లే జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, నాయబ్ తహసీల్దార్ టు తహసీల్దార్, తహసీల్దార్ టు డిప్యూటీ కలెక్టర్లుగా పదోన్నతులు ఇప్పించడం జరిగిందని గుర్తుచేశారు. ట్రెస్మా జిల్లా అధ్యక్షుడిగా గంగాధర్‌రావు, కార్యదర్శిగా కిరణ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా దశరథ్, కోశాధికారిగా బాలరాజుతో పాటు మరో 23 మంది సభ్యులను ఎన్నికల అధికారి నారాయణరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఉద్యోగుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఎస్టీలకు ప్రాధాన్యం కల్పించాలి

● ఎస్టీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్కలి నరసింహ

మనోహరాబాద్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్టీ కులాలకు ప్రభుత్వం ప్రాధాన్యం కల్పించాలని ఎస్టీల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్కలి నరసింహ కోరారు. ఆదివారం కాళ్లకల్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ మేజర్ గ్రామపంచాయతీ అని, దాదాపు 15 వేల వరకు జనాభా ఉంటుందని చెప్పారు. కావున వచ్చే ఎన్నికల్లో ఎస్టీ రిజర్వేషన్ వచ్చేలా చూడాలన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి: జ్యోతీకృష్ణ



తూప్రాన్‌లో సీసీ పనులను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతీకృష్ణ

తూప్రాన్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): సీసీ పనులు నాణ్యతతో చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతీకృష్ణ పేర్కొన్నారు. తూప్రాన్ పట్టణ నర్సాపూర్ రోడ్డు 8వ వార్డులో ఓపెన్ మురుగుకాలువపై వేస్తున్న సీసీ స్లాబ్ పనులను పరిశీలించారు. ఓపెన్ డ్రైనేజీలతో దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రజల ఫిర్యాదులతో ఓపెన్ డ్రైనేజీలపై స్లాబ్‌లు వేస్తున్నట్లు వివరించారు. ఆమె వెంట కౌన్సిలర్ రామునిగారి శ్రీశైలంగౌడ్, మాజీ సర్పంచ్ కొడిప్యాక వెంకటేశంగుప్తా, నర్సింహారెడ్డి, బజారు రవీంద్ర ఉన్నారు.

పదేళ్లకు మారిన గ్రామీణ బ్యాంకు పేరు



ఖేడ్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరిట ఏర్పాటు చేసిన బోర్డు

నారాయణఖేడ్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆవిర్భవించిన పదేళ్ల అనంతరం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు పేరును తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశారు. మొదట్లో జిల్లాకు ఒక గ్రామీణ బ్యాంకు చొప్పున ఏర్పాటుచేశారు. అప్పట్లో ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించి మంజీరా గ్రామీణ బ్యాంకును ఏర్పాటు చేయగా, అనంతరం బ్యాంకు శాఖలు పెరుగడంతో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకులుగా మార్చారు. తెలంగాణ ఆవిర్భవించిన అనంతరం కూడా అదే పేరుతో సేవలందించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు పేరును మార్చి, తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా ఏర్పాటు చేశారు. దీంతో రెండురోజులుగా గ్రామీణ బ్యాంకు సేవలు నిలిచిపోయాయి. జనవరి 1 నుంచి తిరిగి తెలంగాణ గ్రామీణ బ్యాంకు పేరుతో సేవలందించనున్నారు.

గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడిగా దేశపతి శంకరశర్మ



నూతనంగా ఎన్నికైన గజ్వేల్ డివిజన్ సేవా సమాఖ్య కమిటీ సభ్యులు

గజ్వేల్ రూరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య(2025-28) నూతన కమిటీ ఎంపికకు గజ్వేల్ పట్టణంలోని సంగాపూర్ రోడ్డు శ్రీప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. సుమారు వందమంది సభ్యులు హాజరుకాగా ఎన్నికల అధికారిగా దేశపతి రాజశేఖరశర్మ వ్యవహరించారు. ఎన్నికలు ఏకగ్రీవంగా జరగగా అధ్యక్షుడిగా దేశపతి శంకరశర్మ, ఉపాధ్యక్షుడిగా రామారావు, విశ్వేశ్వరరావు, రాయపోల్ వెంకటేశ్వరశర్మ ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శి రేపల్లి రవీందర్‌రావు, సహాయ కార్యదర్శిగా కొడకండ్ల రామదత్తశర్మ, వర్ధచార్యులు, కోశాధికారిగా కృష్ణమూర్తిశర్మ ఎన్నికయ్యారు. యువ పరిషత్ అధ్యక్షుడిగా విరాల సాయికృష్ణశర్మ, కార్యదర్శిగా నందగిరి, శ్యాంప్రసాద్‌శర్మ, కోశాధికారిగా మామురాల రాఘవేంద్రరావు, ఉపాధ్యక్షులుగా కొడకండ్ల శివకుమార్‌శర్మ, దేశాయి కార్తీక్‌శర్మ ఎంపికయ్యారు. కార్యక్రమంలో విరాల నరసింహస్వామిశర్మ, జాలిగామ సుధాకర్‌రావు, బెజగామ నాగేంద్రరావు, రేపల్లి జితేందర్‌రావు, బండారు రాంప్రసాదరావు, హనుమంతరావు, నందబాలశర్మ, శ్రీనివాసచార్యులు, శ్రీనివాసశర్మ, బ్రాహ్మణ సంఘం సభ్యులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

మార్చి లోపు 50 శాతం పీఆర్‌సీ ప్రకటించాలి

సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 29 (ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరం మార్చి 30 లోపు 50 శాతం పీఆర్సీని ప్రకటించాలని కరీంనగర్ శాసనమండలి పీఆర్టీయూ అధికార అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సిద్దిపేట పీఆర్టీయూభవన్‌లో ఆయన జిల్లా శాఖ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. నూతన సంవత్సరంలో ఉపాధ్యాయుల సమస్యలన్నింటిని ప్రభుత్వం పరిష్కరించాలని, నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందాలన్నారు. ప్రస్తుతం తెలంగాణలో ఉపాధ్యాయ ఉద్యోగులంతా మంచి పీఆర్సీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెను విరమింపజేసి వెంటనే వారికి మినిమం టైంస్కేల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కొత్త సంవత్సరంలో ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ భేషరతుగా అన్ని కార్పొరేట్ హాస్పిటళ్లలో ఉచిత వైద్యమందించాలని కోరారు.